
వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను తిలకిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

రైతు సంక్షేమమే
మా ధ్యేయం

- రాష్ట్రంలో మళ్లీ ద్రావిడ తరహా పాలనే
- ఈరోడ్ సభలో స్టాలిన్

చెన్నై, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే డీఎంకే ద్రావిడ తరహా ప్రభుత్వ ధ్యేయమని, రైతులకు ఏ కష్టమొచ్చినా అందరికంటే ముందుగా తానే వారికి అండగా ఉంటానని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. నాలుగేళ్ల పాలనలో ఎన్నికల హామీలనే కాకుండా కొత్త హామీలను కూడా నెరవేర్చామని, తమ పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, తనపై ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాలను చూస్తుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో మరింత మెజారిటీతో డీఎంకే ద్రావిడతరహా పాలన 2.0 అధికారంలో రావటం తథ్యమని స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఈరోడ్ జిల్లా పెరుందురై- విజయమంగళం ప్రాంతం వద్ద వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అగ్రి ఎక్స్‌పో-2025 (వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, సదస్సు)ను బుధవారం ఉదయం ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో వ్యవసాయ, ఉద్యానవన, గిరిజన తదితర శాఖలకు సంబంధించిన ఉత్పత్తులను ప్రదర్శనగా ఉంచారు. ఇదే విధంగా ఆవిన్, సహకార సంస్థలు మత్స్య విశ్వవిద్యాలయం, నాబార్డ్ కూడా తమ సంస్థలకు చెందిన స్టాల్స్ ఏర్పాటు చేశాయి. ఈ సభలోనే ఈరోడ్ జిల్లాలో రూ.175.23 కోట్లతో పూర్తయిన పథకాలకు సీఎం ప్రారంభోత్సవం చేశారు. 11 కొత్త పథకాలకు శంకుస్థాపన జరిపారు. 4524 మంది లబ్ధిదారులకు రూ.25.41 కోట్ల విలువైన సహాయాలను అందజేశారు. ఈ సందర్భంగా సభలో స్టాలిన్ మాట్లాడుతూ గురువారం ఉదయం మేట్టూరు డ్యామ్ నుంచి సాగునీరు విడుదల చేయనున్న సమయంలో దేశంలో 'పసుపు నగరం'గా పేరొందిన ఈరోడ్‌లో వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రారంభించడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రిగా పదవిని చేపట్టిన వెంటనే తాను వ్యవసాయ శాఖ పేరును వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖగా మార్చానని, అందుకు తగినట్లుగానే వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ కూడా ప్రవేశపెడుతున్నామని వెల్లడించారు. గత నాలుగేళ్లలో ఆహారధాన్యాల ఉత్పత్తిని 458 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచామని, సహకార శాఖ ద్వారా రూ.62,352 కోట్ల మేరకు రైతులకు పంట రుణాలు మంజూరు చేశామని చెప్పారు. చిరుధాన్యాల (సజ్జలు, నువ్వులు, కందిపప్పు) ఉత్పత్తిలో దేశంలోనే రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందని, మొక్కజొన్నలు, నూనెవిత్తులు, చెరకు ఉత్పత్తిలో ద్వితీయ స్థానంలో ఉందని సీఎం పేర్కొన్నారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వంగానే ఉండేదని, ఢిల్లీలో తమ సమస్యల పరిష్కారం కోసం, మూడు వ్యవసాయవ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ నెలల తరబడి రైతులు ఆందోళనలు చేసినా అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. అన్ని వర్గాలకు అన్ని సదుపాయాలు అందించటమే తమ ప్రభుత్వ ధ్యేయమని, ప్రతిపక్షాలు ఎన్ని కుయుక్తులకు పాల్పడినా రాష్ట్రంలో రానున్నది మళ్లీ డీఎంకే ద్రావిడ తరహా పాలన 2.0 అని స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఈవీ వేలు, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, ఎస్.ముత్తుసామి, ఎంపీ సామినాథన్, ఎన్.కయల్‌విళి సెల్వరాజ్, ఢిల్లీలోని ప్రభుత్వ ప్రతినిధి ఏకేఎస్ విజయన్, ఎంపీలు అందియూరు సెల్వరాజన్, కేఈ ప్రకాష్, కె.సుబ్బరాయన్, ఎమ్మెల్యేలు వీసీ చంద్రకుమార్, ఏజీ వెంకటాచలం, పూండి కలైవానన్, మాజీ మంత్రి తోప్పు వెంకటాచలం, పశుసంవర్థక, పాడి, మత్స్య శాఖల కార్యదర్శి డాక్టర్ సుబ్బయ్యన్, వ్యవసాయ ఉత్పత్తుల కమిషనర్ వి.దక్షిణామూర్తి, జిల్లా కలెక్టర్ రాజగోపాల్ సుంకర తదితరులు పాల్గొన్నారు.

లాలూప్రసాద్‌కు సీఎం జన్మదిన శుభాకాంక్షలు

పెరంబూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ జనతాదళ్ అధ్యక్షుడు, బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సీఎం స్టాలిన్ తన ఎక్స్ పేజీలో... ".రాష్ట్రీయ జనతాదళ్ అధ్యక్షుడు లాలూ ప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు.. అణగారిన ప్రజలకు చెందిన వారిని కేంద్రంలో అధికారంలో ఉంచిన దేశ రాజకీయ అగ్రనేతల్లో లాలూప్రసాద్ ఒకరు. మండల కమిషన్ సిఫార్సులు దృఢంగా అమలుచేయడం, మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా బలమైన రక్షణగా ఉండడం ద్వారా ఆయన జాతీయస్థాయిలో సామాజిక న్యాయం కోసం మార్గం సుగమం చేశారు. ఆయనకు దీర్ఘాయుష్షు, మంచి ఆరోగ్యం కలగాలని కోరుకుంటున్నాను" అంటూ సీఎం స్టాలిన్ పోస్ట్ చేశారు.

ఒక్కో పోలింగ్ కేంద్రంలో
1,200 మంది ఓటర్లు

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్



వాషర్‌మెన్‌పేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రానున్న శాసనసభ ఎన్నికల్లో ఒక పోలింగ్ కేంద్రంలో 1,200 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్ తెలిపారు. సచివాలయంలోని ఎన్నికల కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... పోలింగ్ కేంద్రాల్లోకి ఓటర్లు సెల్‌ఫోన్లు తీసుకెళ్లడంపై ఈసీ నిషేధం విధించిందని, అందుకోసం పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు సెల్‌ఫోన్ భద్రపరచుకొనేలా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయనున్నామన్నారు. ఓటర్లు అధికంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి, వాటిని విభజించి ఒక్కో కేంద్రంలో 1,200 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టామని తెలిపారు. అందుకోసం అదనపు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేసే ప్రాంతాలు ఎంపిక చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 68,400 పోలింగ్ కేంద్రాలుండగా, 1,200 మంది ఓటర్లకు ఒక కేంద్రం ఏర్పాటుతో పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరిగే అవకాశముందని తెలిపారు. ఓటర్ల జాబితా పరిశీలన పనులు అక్టోబరు నుంచి ప్రారంభించనున్నట్లు అర్చనా పట్నాయక్ తెలిపారు.

దేశంలోనే తొలిసారి..! 5
9 అంతస్థుల భవనంలో
మెట్రో రైలు పరుగులు

నాలుగు రోజుల పాటు వర్షాలు

- వాతావరణ శాఖ వెల్లడి

ప్యారీస్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్న క్రమంలో రానున్న నాలుగురోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని, నీలగిరి జిల్లాలో ఈ నెల 14వ తేదీన భారీ వర్షం కురుస్తుందని వాతావారణ పరిశోధన కేంద్రం హెచ్చరించింది. మరోవైపు రానున్న 12 గంటల్లో అరేబియా సముద్రంలో అల్పపీడనం ఏర్పడుతుందని, ఇది ఉత్తర దిశగా కదులుతోందని, రాగల 36 గంటల్లో మరింత బలపడి అల్పపీడనంగా మారే అవకాశముందని ఆ శాఖ పేర్కొంది. అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో ఈ నెల 17వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. సముద్రంలో గంటకు 40-50 కిమీ. వేగంతో గాలులు వీచే అవకాశముందని, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పర్వతశ్రేణులు, జలపాతాలు అధికంగా కలిగిన జిల్లాల్లో బుధవారం నుంచే వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో గత వారంరోజుల వరకు అత్యధికంగా నమోదైన ఉష్ణోగ్రతలతో తల్లడిల్లిన ప్రజలు, సోమవారం నుండి కురుస్తున్న మోస్తరు వర్షాలతో భూమి చల్లబడుతుండటంతో ఉపశమనం పొందుతున్నారు. వాతావరణంలో కలిగిన మార్పులతో బుధవారం తిరువణ్ణామలై, రాణిపేట, వేలూరు, తిరుపత్తూరు, విల్లుపురం, చెంగల్పట్టు, కాంచీపురం, కడలూరు, అరియలూరు, మైలాడుదురై, నాటపట్నం జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. అదేవిధంగా గురువారం కోయంబత్తూరు జిల్లా సరిహద్దు ప్రాంతాలైన నీలగిరి, తేని, తిరువళ్లూరు, రాణిపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ తెలిపింది. 13వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం అధికంగా నమోదవుతుందని తెలిపింది.



ఏడు జిల్లాల కలెక్టర్లకు...

నీలగిరి, దిండుగల్, తేని, తెన్‌కాశి, తిరునల్వేలి, కన్నియాకుమారి, కోయంబత్తూరు జిల్లాల్లో ఈ నెల 17వ తేదీవరకు వర్షాలు భారీగా కురిసే అవకాశమున్నందువల్ల ప్రజలకు నష్టం కలుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాల్సిందిగా ఈ జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అప్రమత్తం చేసింది. వర్షం కారణంగా వరద సంభవించే ప్రాంతాల్లో సహాయ చర్యల నిర్వహణకు ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది, పోలీసు బలగాలను సిద్ధం చేసుకోవాలని ఆ శాఖ ఆదేశించింది.

నీలగిరి జిల్లాకు రెడ్ అలెర్ట్...

పర్వతశ్రేణులు, జలపాతాలు అధికంగా ఉన్న నీలగిరి జిల్లాలో శుక్రవారం నుండి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేసింది. వచ్చే శని,ఆదివారాల్లో ఎడతెరపిలేకుండా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందువల్ల ఈ జిల్లాకు రెడ్ అలెర్ట్ ప్రకటించారు. శనివారం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో భారీవర్షం కురుస్తుందన్నది వాతావరణశాఖ నిపుణుల అంచనా. జిల్లాలో అతిభారీ వర్షాలు కురిసే అవకాశమున్నందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన తాగునీరు, పాలు, ఆహార ధాన్యాలను ముందుగానే ఏర్పాటు చేసుకోవాలి సూచించారు. 16వ తేదీ జిల్లాలోని పలు ప్రాంతాలు, అలాగే కోయంబత్తూరు జిల్లాలోని కొండ ప్రాంతాలు, తిరునల్వేలి, తేని, దిండుగల్, తెన్‌కాశి, కన్నియాకుమారి జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. 15వ తేదీ నీలగిరి జిల్లాలో ఊటీ, కోతగిరి, ఎమరాల్డ్ తదితర ప్రాంతాలు, తిరునల్వేలి జిల్లాలో కొండ ప్రాంతాలు, తెన్‌కాశి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశముంది. కాగా, చెన్నై, శివారు ప్రాంతాల్లో గురువారం వాతావరణం పొడిగావుంటుందని, అప్పుడప్పుడు ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు రాలే అవకాశముంది.

కోస్తా జిల్లాలకు హెచ్చరిక...

దక్షిణ తమిళనాడు సముద్రతీర జిల్లాల్లో గురువారం తెల్లవారుజాము నుంచి 14వతేదీ శనివారం వరకు సముద్రంలో గంటకు 45 నుండి 55 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ఉపరితల ఆవర్తనం కదలికలను బట్టి గాలుల వేగం 65 కిలోమీటర్లకు పెరిగే అవకాశముందని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. ఇందువల్ల స్థానిక పట్టినంబాక్కం, కోవళం, మహాబలిపురం సహా కన్నియాకుమారి వరకు గల సముద్రతీర ప్రాంతాల్లో నివసిస్తున్న జాలర్లు చేపలవేటకు వెళ్ళరాదని హెచ్చరిక జారీ అయ్యింది.

పాదయాత్ర బృందంపైకి
దూసుకెళ్లిన కారు

- ముగ్గురు భక్తుల మృతి
- నలుగురికి తీవ్రగాయాలు


మృతి చెందిన స్టెల్లా మేరీ, ఇరుదయసామి, సహాయమేరీ (ఫైల్‌ఫోటో)


ప్రమాదంలో ధ్వంసమైన కారు

టి.నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా మనలూరు వద్ద బుధవారం వేకువజామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా... కడలూరు జిల్లా విరుదాచలం నుండి కళ్ళకురిచ్చి జిల్లాలోని మేల్‌నారియప్పనూరులో ఉన్న సెయింట్ ఆంటోనియర్ ఆలయానికి పదిమందికి పైగా భక్తులు పాదయాత్రగా బయలుదేరారు. కడలూరు సమీపం మనలూరు వద్ద రోడ్డు పక్కన నడచి వెళుతున్న ఈ బృందంపై వేగంగా వచ్చిన ఓ కారు దూసుకెళ్ళింది. ఈ దుర్ఘటనలో హృదయసామి (40), ఆయన కుమార్తె సహాయమేరీ (18), స్టెల్లా మేరీ అనే ముగ్గురు భక్తులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు, క్షతగాత్రులను చికిత్స కోసం విరుదాచలం ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు.

మేమూ ఎక్కువ సీట్లు అడుగుతాం

- డీపీఐ నేత తిరుమా


తిరుమావళవన్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు, పార్టీ నేతలు

చెన్నై, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో కూటమి నుంచి తమకు మరిన్ని సీట్లు కేటాయించాలని డీఎంకే అధిష్టానాన్ని కోరుతామని డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ ప్రకటించారు. చిదంబరం లోక్‌సభ నియోజకవర్గంలో బుధవారం ఉదయం పర్యటించిన ఆయన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పినాత్తూరులో నిర్మించిన సమగ్ర తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. డీఎంకే కూటమిలో ఉన్న సీపీఎం ఈసారి పది సీట్లు కోరుతుండటాన్ని ఆయన సమర్థించారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఎన్నికల్లో సీట్లు పెంచాలని మిత్రపక్షాలన్నీ కూటమికి నాయకత్వం వహిస్తున్న డీఎంకేను కోరటం సహజమని, సీట్ల కేటాయింపు కమిటీ ద్వారా మిత్రపక్షాలు అధికంగా సీట్లు కేటాయించాలని ప్రతిపాదనలు చేస్తుంటాయని చెప్పారు. రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా డీఎంకే మిత్రపక్షాలన్నీ ఆ పార్టీ నాయకత్వంలోని కూటమిలోనే కొనసాగుతున్నాయని, సీట్ల కేటాయింపులపై అసంతృప్తి ఉన్నా మతతత్త్వ శక్తుల నుండి ప్రజలను కాపాడడానికి బీజేపీ - అన్నాడీఎంకేను ఓడించాలన్న ఏకైక తీర్మానంతో ఎన్నికల బరిలోకి దిగుతున్నామని స్పష్టం చేశారు. కేంద్రమంత్రి అమిత్‌షా అదే పనిగా రాష్ట్రంలో పలుమార్లు పర్యటించినా బీజేపీకి ఓట్లు రాలవన్నారు. రాష్ట్రంలో రానున్నది బీజేపీ- అన్నాడీఎంకే సంకీర్ణ ప్రభుత్వమేనని అమిత్‌షా స్పష్టంగా ప్రకటించినా అన్నాడీఎంకే నేతలు ఆ ప్రకటనపై మౌనం దాల్చడం సిగ్గుచేటన్నారు. బీజేపీ అధికారంలో భాగస్వామ్యం ఇచ్చేందుకు అన్నాడీఎంకే సిద్ధంగా ఉన్నట్లు స్పష్టమవుతోందన్నారు. ప్రస్తుతం అన్నాడీఎంకే, బీజేపీ మధ్య పొత్తు ఖరారైనప్పటికీ, అన్నాడీఎంకే మిత్రపక్షాలైన పీఎంకే, డీఎండీకే కొత్తగా ఏర్పాటైన కూటమిలో చేరేందుకు తటపటాయిస్తున్నాయన్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ సారి శాసనసభ ఎన్నికల్లో మునుపటి కంటే అధిక సంఖ్యలో సీట్లు కేటాయించాలని డీఎంకే అధిష్టాంపై ఒత్తిడి చేస్తామని తిరుమావళవన్ పేర్కొన్నారు.

ఈపీఎస్ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్



పెరంబూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రానున్న శాసనసభ ఎన్నికల అనంతరం అన్నాడీఎంకే అధినేత ఈపీఎస్ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటవుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ స్పష్టం చేశారు. తిరునల్వేలి జిల్లా బీజేపీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... తమ కూటమిలో పలు పార్టీలు చేరే అవకాశం ఉందని, దానికి సంబంధించి చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఏది బలమైన పార్టీయో తెలుస్తుందన్నారు. తమదే బలమైన కూటమి అని చెబుతున్న డీఎంకే, ఒంటరిగా పోటీచేసేందుకు సిద్ధమేనా అని ప్రశ్నించారు. మదురైలో జరుగనున్న మురుగన్ మహానాడుకు సుమారు 4 లక్షల మందికి పైగా వచ్చే అవకాశముందని తెలిపారు. ఈ మహానాడులో డీఎంకే, అన్నాడీఎంకే సహా వివిధ పార్టీల నుంచి మురుగన్ భక్తులు పాల్గొంటారని తెలిపారు. గత 11 సంవత్సరాల్లో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్లను ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం అందజేసిందని, ఈ విషయాన్ని ప్రజలకు తెలినివ్వకుండా డీఎంకే ప్రభుత్వం వారిని మభ్యపెడుతున్నారని ఆరోపించారు. తమిళ భాషకు మోదీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, తిరుక్కురళ్‌ను 63 భాషల్లోకి అనువదించి ప్రపంచం మొత్తానికి తీసుకెళ్లిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందన్నారు.

బీజేపీ కూటమిలోకి డీఎంకే కూటమి పార్టీ: కేంద్రమంత్రి మురుగన్

ప్రస్తుతం డీఎంకే కూటమిలో వున్న ఓ పార్టీ త్వరలో బీజేపీ కూటమిలోకి వస్తుందని కేంద్రమంత్రి ఎల్.మురుగన్ వెల్లడించారు. ఈ విషయమై కేంద్రమంత్రి మాట్లాడుతూ... మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీఏ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీ బీజేపీ కూటమిలో ఉందని తెలిపారు. డీఎంకే కూటమి త్వరలోనే విచ్ఛిన్నమవుతుందని, రానున్న శాసనసభ ఎన్నికల్లో ఆ కూటమికి ఘోరపరాజయం తప్పదన్నారు. కొత్తగా కూటమిలో చేరే పార్టీలపై వేచి ఉండాలని, అన్నీ ఇప్పుడే చెబితే రాజకీయాల్లో అంచనాలు ఉండవని కేంద్ర మంత్రి సరదాగా వ్యాఖ్యానించారు.

విరుదునగర్ జిల్లాలో ఘోరం
బాణసంచా గోదాంలో ప్రమాదం


- ముగ్గురు కార్మికుల దుర్మరణం
- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు


భవన శిథిలాలలను తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చెన్నై, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లాలో ఘోర ప్రమాదం సంభవించింది. కారియాపట్టి తాలూకా వడకరై గ్రామంలో వున్న ఓ బాణసంచా కర్మాగారంలో బుధవారం ఉదయం జరిగిన పేలుడు కారణంగా ముగ్గురు కార్మికులు దుర్మరణం చెందారు. రాజాచంద్రశేఖర్ అనే వ్యక్తి నడుపుతున్న ఆ కర్మాగారంలో ఫ్యాన్సీ రకం బాణసంచా తయారు చేస్తున్నారు. రోజూ పదిమందికి పైగా కార్మికులు ఆ కర్మాగారంలో పనిచేస్తుంటారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో బాణసంచా తయారీకి ఉపయోగించే రసాయనాలు భద్రపరిచే గదిలో ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. దీంతో గదిలోపల ఉన్న రసాయనాలకు నిప్పంటుకుని, పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి ఆ భవనం నేలమట్టమైంది. ఈ ప్రమాదంలో కళ్ళకుర్చికి చెందిన చవుడమ్మాళ్ (54), తాండియనేందల్ ప్రాంతానికి చెందిన కరుప్పయ్య (37) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. గణేశన్ (55), మురుగన్ (40), మారియమ్మాళ్ (40), పేచ్చియమ్మాళ్ (38) అనే నలుగురు తీవ్రంగా గాయపడగా, వారిని పోలీసులు విరుదునగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.అయితే అక్కడ చికిత్స పొందుతూ గణేశన్ మరణించాడు.మిగిలిన ముగ్గురి పరిస్థితి కూడా ఆందోళనకరంగానే వున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఆ కర్మాగారం సూపర్‌వైజర్, ఫోర్‌మెన్‌లను పోలీసులు అరెస్టు చేశారు.

సీఎం సంతాపం...

బాణసంచా కర్మాగారంలో ముగ్గురు కార్మికులు మృతిచెందటంపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర సంతాపం ప్రకటించారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు తలా రూ.4లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి తలా రూ.లక్ష, స్వల్పంగా గాయపడినవారికి రూ.50వేల చొప్పున ఆర్థికసాయం అందించనున్నట్లు ప్రకటించారు.


పేలుడుకు నేలకూలిన భవన శిథిలాల వద్ద తీవ్రగాయాలతో పడి ఉన్న కార్మికుడు

ఘనంగా సెయింట్ ఆంథోని చర్చి వార్షిక వేడుకలు

- 14న రథోత్సవం


పావురాళ్లను ఎగురవేస్తున్న సీనియర్ ఫాదర్లు

ప్యారీస్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడి ప్రాంతంలోని సెయింట్ ఆంథోని చర్చి 75వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీ వరకు వేడుకలు నిర్వహించనున్నారు. ఈ నాలుగు రోజుల వేడుకలను పురస్కరించుకుని ఆలయాన్ని అలంకరించారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం చర్చి ప్రాంగణంలో సీనియర్ ఫాదర్లు ఎంవీ జాకబ్, పీజే లారెన్స్‌రాజ్, జీజే ఆంథోనిస్వామి తదితరులు పురవీధుల్లో ఊరేగించిన పతాకాన్ని జెండా స్తంభంపై ఆవిష్కరించి వేడుకలు ప్రారంభించారు. అనంతరం విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేసి, పావురాళ్లను ఎగురవేశారు. ప్రారంభోత్సవంలో ఆవడి, కామరాజర్‌నగర్, పట్టాభిరాం, అన్ననూర్, తిరుముల్లైవాయల్, అంబత్తూరు తదితర ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. 13వ తేదీ సాయంత్రం 6 గంటలకు వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు. 14వ తేదీ శనివారం సాయంత్రం 6 గంటలకు రథోత్సవం. 15న మహా అన్నదానం, సంక్షేమ సహాయాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని చర్చి నిర్వాహకులు తెలిపారు. 75వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనాలని ఆలయ సీనియర్ ఫాదర్ జీజే ఆంథోనిస్వామి ప్రజలకు పిలుపునిచ్చారు.


శోభాయమానంగా వెలిగిపోతున్న సెయింట్ ఆంథోని చర్చి

సమాచార దృష్టి

'జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు' పురస్కారం కోసం దరఖాస్తులు

పెరంబూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కళాశాల అధ్యాపకులు 'జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు' పురస్కారానికి దరఖాస్తు చేసుకోవాలని యూజీసీ ఒక ప్రకటనలో తెలిపింది. 2025వ పురస్కారానికి ఉన్నత విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లు, ఐటీఐ ఇన్‌స్ట్రక్టర్లు, పాలిటెక్నిక్ లెక్చరర్లు www.awards.gov.in అనే వెబ్‌సైట్‌లో జూలై 9వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకునే ఉపాధ్యాయులు బోధనలో వారి ఉత్తమ కార్యక్రమాలు, పరిశోధన వివరాలు సమగ్రంగా తెలియజేయాల్సి ఉంది. కళాశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్లు, వైస్ ఛాన్సలర్లు, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు కారని యూజీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

పళని హుండీ ఆదాయం రూ.2.36 కోట్లు

పెరంబూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా పళని దండాయుధపాణి ఆలయ హుండీ ఆదాయం రూ.2.36కోట్లు వచ్చినట్టు అధికారులు తెలిపారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కించారు. గత నెలకు సంబంధించిన హుండీ ఆదాయం లెక్కింపు ఆలయ ప్రాంగణంలో రెండు రోజులుగా జరిగింది. రూ.2,36,05,903 నగదు, 355 గ్రాముల బంగారం, 5,961 గ్రాముల వెండి, 500 విదేశీ కరెన్సీ కానుకగా సమర్పించారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నగరంలో 9 ప్రాంతాల్లో ఛార్జింగ్ కేంద్రాలు

పెరంబూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కోసం 9 ప్రాంతాలు ఎంపిక చేశారు. బీసెంట్ నగర్ అష్టలక్ష్మి ఆలయ పార్కింగ్, బీసెంట్‌నగర్ బీచ్ పార్కింగ్, అంబత్తూర్ మంగల్‌ఏరి పార్కింగ్, టి.నగర్ కార్పొరేషన్ గ్రౌండ్ పార్కింగ్, టి.నగర్ సోమసుందరం గ్రౌండ్, థౌజండ్ లైట్స్ సెమ్మొళి పార్క్, మెరీనా బీచ్ పార్కింగ్, అన్నానగర్ బోగన్ విల్లా పార్క్, మైలాపూర్ నాగేశ్వరరావు పార్క్ తదితర ప్రాంతాలను విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కోసం ఎంపిక చేసినట్లు, రెండు వారాల్లో టెండర్లు ఆహ్వానించి సంస్థను ఎంపిక చేసి పనులు ప్రారంభించనున్నట్లు జీసీసీ అధికారులు తెలిపారు.

పంట రుణాలకు 'సిబిల్ స్కోర్' అవసరం లేదు

పెరంబూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార రుణ సంఘాల్లో రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డు పథకంలో 7 శాతం వడ్డీతో పంట రుణాలిస్తున్నారు. రైతులు తీసుకున్న రుణం నిర్ణీత కాలంలో చెల్లిస్తే వడ్డీ నుంచి మినహాయింపు కల్పిస్తున్నారు. కొన్ని సహకార సంఘాలు 'సిబిల్ స్కోర్' ఆధారంగా రుణాలిస్తున్నాయంటూ ఫిర్యాదులందాయి. ఈ నేపథ్యంలో, కిసాన్ క్రెడిట్ కార్డు సహా ఎలాంటి రుణాలు పొందేందుకు సిబిల్ స్కోర్ అవసరం లేదని, తీసుకున్న రుణం క్రమంగా చెల్లించారా? లేదా? అనే ప్రాతిపదికన రుణాలు అందజేయనున్నట్లు సహకార శాఖ ప్రకటన విడుదల చేసింది.

రూ.391 కోట్లతో 3,644 రోడ్లకు మరమ్మతులు

పెరంబూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని 3,644 రోడ్ల మరమ్మతులకు రూ.391 కోట్లు కేటాయించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా రోడ్ల మరమ్మతులు నైరుతి రుతుపవనాల ప్రారంభానికి ముందే పూర్తిచేయాలని నిర్ణయించినట్లు జీసీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

6న మదురైలో ఎంఎంకే మహానాడు

పెరంబూర్,జూన్11(ఆంధ్రజ్యోతి): మనిదనేయ మక్కల్ కట్చి (ఎంఎంకే) మహానాడు జూలై 6న మదురైలో జరుగనుంది. ఈ మేరకు ఎంఎంకే అధ్యక్షుడు జవాహిరుల్లా విడుదల చేసిన ప్రకటనలో... ఇస్లామీయులకు అధికారంలో భాగస్వామ్యం కల్పించాలి, వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని తదితర డిమాండ్లతో జరుగున్న ఈ మహానాడు సందర్భంగా మదురైలో భారీ ర్యాలీ, బహిరంగ సభ జరుగుతుందని జవాహిరుల్లా తెలిపారు.

రేపు టీవీకే విద్యా పురస్కారాల ప్రదానోత్సవం

పెరంబూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఆధ్వర్యంలో మూడో విడత విద్యా పురస్కారాల ప్రదానోత్సవం శుక్రవారం జరుగనుంది. 10,12 తరగతుల ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు టీవీకే ఆధ్వర్యంలో విద్యా పురస్కారాలు అందజేస్తున్నారు. ఇప్పటికే రెండు విడతల్లో పురస్కారాలు అందించారు. మూడో విడత పురస్కారాల ప్రదానోత్సవం శుక్రవారం మహాబలిపురం సమీపంలోని కల్యాణ మండపంలో జరుగనుంది. నాలుగవ విడత పురస్కారాల ప్రదానోత్సవం కూడా ఈ వారంలో నిర్వహించాలని నిర్ణయించారు. ప్రదానోత్సవం ఏర్పాట్లను పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ పర్యవేక్షిస్తున్నారు.

తాత్కాలిక టీచర్ల గౌరవ వేతనాలకు రూ.27 కోట్లు

పెరంబూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తాత్కాలిక ఉపాధ్యాయులకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన గౌరవ వేతనం కోసం రూ.27.20 కోట్లు కేటాయించారు. 2025-26 విద్యా సంవత్సరానికి మొత్తం గౌరవ వేతనం రూ.93.41 కోట్లు కేటాయించినట్లు, తొలివిడతగా రూ.27.20 కోట్లు విడుదల చేసినట్లు పాఠశాల విద్యా డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

ప్రభుత్వ హాస్టళ్లలో సీసీ కెమెరాలు

పెరంబూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని హాస్టళలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయనున్నట్లు బీసీ, మైనారీ శాఖ మంత్రి మెయ్యనాథన్ తెలిపారు. శివగంగలో బుధవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 'పుదుమై పెన్', 'తమిళ్‌పుదల్వన్' పథకాల అమలుతో కళాశాలల్లో చేరే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. నాలుగేళ్లలో 36 కళాశాలలకు సంబంధించిన హాస్టల్స్ ప్రారంభించామని, గత ఏడాదిలోనే 19 హాస్టల్స్ ప్రారంభించగా, ఈ ఏడాది 10 హాస్టల్స్ ప్రారంభించనున్నామన్నారు. కలైంజర్ సెంటినరీ లైబ్రరీలోని పుస్తకాలను హాస్టల్ విద్యార్థులు ఆన్‌లైన్‌లో చదువుకునేలా వైఫై సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని బాలుర, బాలికల హాస్టల్స్‌లో రూ.10.59 కోట్లతో ఆధునిక సీసీ కెమెరాలు అమర్చనున్నట్లు మంత్రి తెలిపారు.

అన్నామలైకు నోటీసు

వాషర్‌మెన్‌పేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అన్నా యూనివర్సిటీ విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో తనపై ఆరోపణలు చేసిన అన్నామలై క్షమాపణలు చెప్పాలని యూనివర్శిటీ పీఆర్వో నటరాజన్ లీగల్ నోటీసు పంపారు. అన్నా యూనివర్శిటీలో జరిగిన అత్యాచారం కేసులో వర్శిటీ పీఆర్వో సహా ఇతరులకు ప్రమేయం ఉందంటూ ఇటీవల బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై విమర్శలు చేశారు. ఈ వ్యాఖ్యలను ఖండించిన పీఆర్వో నటరాజన్, తనపై అసత్య ఆరోపణలు చేసిన అన్నామలై క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలని కేసు వేస్తానంటూ నటరాజన్ లీగల్ నోటీసు పంపారు.

● 'కనియామూర్' హింసాకాండ కేసు..

కోర్టులో విచారణకు 92 మంది హాజరు

టి.నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కళ్లకురిచ్చి జిల్లా కనియామూర్ ప్రైవేటు పాఠశాలలో జరిగిన హింసాకాండ కేసుకు సంబంధించి కళ్ళకురిచ్చి కోర్టులో 92 మంది నిందితులు హాజరయ్యారు. ఈ కేసు తదుపరి విచారణను జూలై 9కి వాయిదా వేస్తూ కోర్టు ఉత్తర్వు జారీ చేసింది. 2022 జూలై 13న కళ్లకురిచ్చి సమీపం కనియామూర్‌లోని ప్రైవేటు మెట్రిక్యులేషన్ పాఠశాల ప్రాంగణంలో శ్రీమతి అనే ప్లస్-2 విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందింది. ఆ నేపథ్యంలో జూలై 17న ఆమె బంధువులు, వివిధ సంఘాల నిర్వాహకులు, స్థానికులు పాఠశాలను ముట్టడించి హింసాకాండకు పాల్పడ్డారు. పాఠశాల మైదానంలో వాహనాలకు నిప్పంటించారు. తరగతి గదులలోకి ప్రవేశించి ఫర్నిచర్, కంప్యూటర్లను ధ్వంసం చేశారు.. ఆ హింసను నిరోధించడానికి వెళ్ళిన డీఐజీ ప్రవీణ్‌కుమార్ అభినవ్‌పై దాడి చేసి, ఎస్పీ వాహనం, టాస్క్‌ఫోర్స్ వాహనాన్ని ధ్వంసం చేశారు. ఆ హింసాకాండకు సంబంధించి 119 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో ముగ్గురు మృతి చెందటంతో మిగిలిన 116 మందిని కోర్టు విచారణకు హాజరుకావాలని సమన్‌లు జారీ అయ్యాయి. ఆ మేరకు కళ్లకురిచ్చి కోర్టులో మేజిస్ట్రేట్ రీనా ఎదుట 92 మంది నిందితులు మాత్రమే హాజరయ్యారు. ఆ తర్వాత కేసు తదుపరి విచారణను జూలై 9కి వాయిదా వేస్తూ ఆమె ఉత్తర్వు జారీచేశారు.



విచారణకు హాజరయ్యేందుకు వచ్చిన నిందితులు

మంత్రి వేలుకు కరెన్సీ మాలతో స్వాగతం

● విజయ్‌కి సారీ చెప్పిన టీవీకే నేత

టి.నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) తిరువణ్ణామలై దక్షిణ జిల్లా శాఖ కార్యదర్శి భారతిదాసన్ తను కొత్తగా నిర్మించిన ఇంటి గృహప్రవేశ వేడుకలకు విచ్చేసిన మంత్రి ఈవీ వేలుకు రూ.20ల కరెన్సీ మాల వేసి స్వాగతం పలకటం వివాదాస్పదంగా మారింది. ఈ నెల 8న జరిగిన గృహ ప్రవేశానికి మంత్రి ఈవీ వేలును ఆహ్వానించారు. మంత్రి ఈ కార్యక్రమానికి రావడంతో భారతిదాసన్ సంతోషంగా ఆయనకు కరెన్సీ నోట్ల మాల వేసి స్వాగతం పలికారు. ఆ వేడుకల్లో మంత్రి పాల్గొని భారతిదాసన్‌కు కానుకను కూడా అందజేశారు. ఈ నేపథ్యంలో మంత్రి వేలును కరెన్సీ నోట్ల మాలవేసి భారతిదాసన్ స్వాగతం పలుకుతున్న వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది. డీఎంకేను రాజకీయ బద్ధశత్రువుగా భావిస్తున్న టీవీకేకు చెందిన నాయకుడు మంత్రి వేలును కరెన్సీమాలతో స్వాగతం పలకడం న్యాయమేనా అంటూ నెటిజన్లు విమర్శల వర్షం కురిపించారు. దీంతో టీవీకే అధిష్ఠానం ఆయనకు షోకాజు నోటీసు జారీ చేసింది. దానికి భారతిదాసన్ బదులిస్తూ తమ కుటుంబ స్నేహితుడైన మంత్రి ఈవీ వేలును గృహప్రవేశానికి ఆహ్వానించానని, ఆ సందర్భంగా రాష్ట్ర మంత్రి కనుక ఆయనను గౌరవించాలనే భావంతోనే కరెన్సీ నోట్ల మాల వేసి స్వాగతించానని చెప్పారు. ఆ సంఘటన పట్ల పార్టీ అధిష్ఠాన వర్గానికి ఆయన బేషరతుగా క్షమాపణ తెలిపారు. ఇకపై టీవీకే వ్యతిరేకించే పార్టీ ప్రముఖులందరికీ దూరంగా ఉంటానని, తన ఇంట జరిగే వేడుకలకు డీఎంకేకు చెందినవారిని ఎట్టి పరిస్థితులలోనూ ఆహ్వానించనని స్పష్టం చేస్తూ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కి మరోమారు తాను క్షమాపణలు తెలుపుకుంటున్నానని భారతిదాసన్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మంత్రి ఈవీ వేలు ఈ సంఘటనపై వివరణ ఇస్తూ భారతిదాసన్ కుటుంబ సభ్యుల్లో చాలామంది డీఎంకేకు చెందినవారని, కనుక ఆ కుటుంబంతో తనకు చాలా కాలంగా సంబంధాలున్నాయని, ఆ కారణంగా గృహప్రవేశ కార్యక్రమానికి వెళ్ళానని తెలిపారు. అంతేకాకుండా తిరువణ్ణామలై నియోజకవర్గంలో ఏ పార్టీకి చెందినవారైనా వారింట జరిగే శుభకార్యాలకు ఆహ్వానిస్తే, వీలునుబట్టి తప్పకుండా వెళతానని చెప్పారు.



మంత్రి వేలుకు కరెన్సీ మాల వేస్తున్న టీవీకే నేత భారతిదాసన్

వారాంతపు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవుల సందర్భంగా ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) తెలిపింది. ఈ మేరకు ఎస్ఈటీసీ విడుదల చేసిన ప్రకటనలో.. కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు ఈ నెల 13న 385బస్సులు, 14న 350ప్రత్యేక బస్సులు నడపనున్నామన్నారు. అలాగే, కోయంబేడు టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు 13, 14 తేదీల్లో తలా 55 బస్సులు, మాధవరం బస్ టెర్మినల్ నుంచి 13,14 తేదీల్లో తలా 20 బస్సులు నడుపునున్నామన్నారు. అలాగే, బెంగళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోయంబత్తూర్ తదితర నగరాలనుంచి పలుప్రాంతాలకు 250 ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. వారాంతపు సెలవుల అనంతరం తిరిగొచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం అవసరమైన ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. శుక్రవారం ప్రయాణం చేసేందుకు 6,168మంది, శనివారం 2,652 మంది, ఆదివారం ప్రయాణం చేసేందుకు 6,469 మంది ముందస్తు రిజర్వేషన్ చేసుకున్నారని, ప్రయాణికులు సౌకర్యవంతమైన ప్రయాణానికి 'టీఎన్ఎస్‌టీసీ' వెబ్‌సైట్‌లో ముందుగా రిజర్వేషన్ చేసుకోవాలని ఎస్ఈటీసీ ప్రకటనలో తెలియజేసింది.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేళల్లో మార్పు

ప్యారీస్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు నడుపుతున్న 37 ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేళలు మార్పుచేసినట్లు దక్షిణ రైల్వే శాఖ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ నుండి జూన్ 12,16,19,23, 26,30 తేదీల్లో మధ్యాహ్నం 2.05 గంటలకు బయలుదేరే పినాకిని ఎక్స్‌ప్రెస్ (నెం:12712) 20 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరుతుంది. అదేవిధంగా తిరుచెందూర్ నుంచి చెన్నై ఎగ్మూర్‌కు బయలుదేరే రైలు (నెం:20606) బన్రూటి రైల్వేస్టేషన్‌లో ఉదయం 6.04 గంటలకు ఆగివెళ్తుంది. ఈ రైలు బుధవారం నుండి 25 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరుతుంది. ఎగ్మూర్-విల్లుపురం మధ్య నడుపుతున్న ఎక్స్‌ప్రెస్ వేళలో ఎలాంటి మార్పు ఉండదని దక్షిణ రైల్వేశాఖ స్పష్టం చేసింది. తిరునల్వేలి నుండి గుజరాత్ రాష్ట్రం హబ్బాకు వెళ్ళే ఎక్స్‌ప్రెస్ (నెం: 19577) ఈ నెల 15 నుండి ఉదయం 5.05 గంటలకు బయలుదేరుతుంది. అదేవిధంగా తిరునల్వేలి నుంచి గాంధీగ్రామ్ వెళ్ళే రైలు (నెం: 20923) ఉదయం 5.05 గంటకు బయలుదేరుతుంది. కోవై నుంచి హర్యానా రాష్ట్రం కిసార్‌కు వెళ్ళే రైలు (నెం: 22476) మధ్యాహ్నం 1.35 గంటలకు కోయంబత్తూరు నుంచి బయలుదేరుతుంది. మరుమార్గంలో ముంబాయి నుండి రైలు (నెం: 22629) మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరుతుంది. తిరునల్వేలి నుండి వెళ్లే దాదర్ ఎక్స్‌ప్రెస్ (నెం: 22630) సహా 37 ఎక్స్‌ప్రెస్ రైళ్ల సమయాలు మార్పు చేశారు. రామనాథపురం జిల్లా పరమకుడి, చత్రకుడి రైల్వేస్టేషన్ల మధ్య మరమ్మతుల కారణంగా మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేళల్లో కూడా మార్పు చేశారు. ఆ మేరకు తిరుచ్చి నుంచి జూన్ 12,14,16,21,23, జూలై 4వ తేదీల్లో ఉదయం 7.05 గంటలకు రామేశ్వరం బయలుదేరే రైలు (నెం:10849) మానామదురై, రాముశ్వరం మధ్య పాక్షికంగా రద్దు చేసి, మానామదురైలో ఆపుతారు. మరుమార్గంలో అదే రైలు రామేశ్వరం నుండి సాయంత్రం 3గంటలకు బయలుదేరుతుంది. తిరుచ్చి వెళ్ళే ఎక్స్‌ప్రెస్ (నెం: 16850) రామేశ్వరం-మానామదురై మధ్య పాక్షికంగా రద్దు చేశారు. ఆ రైలు రామేశ్వరం నుంచి బదులుగా మానామదురై నుండి సాయంత్రం 4.55 గంటలకు తిరుచ్చి బయలుదేరుతుంది. అలాగే రామేశ్వరం నుండి జూన్ 13,20,27 తేదీల్లో ఉదయం 9.15 సికింద్రాబాద్ వెళ్ళాల్సిన ప్రత్యేక రైలు (నెం: 07696) రాత్రి 7 గంటలకు 19.50 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరుతుందని దక్షిణ రైల్వేశాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

నగలు దోచుకున్న మహిళ అరెస్టు

ప్యారీస్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమింజికరైలో పనిచేసిన ఇంట్లో 30 సవర్ల నగలు దొచుకున్న మహిళను నగర పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే అమింజికరై గోవిందన్‌వీధికి చెందిన మోహన్‌రాజ్ తమ ఇంట్లో 30 సవర్ల నగలు దొపిడీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆ ఇంట్లో పనిచేసిన పూందమల్లికి చెందిన సుకన్య అనే మహిళను మంగళవారం విచారించారు. నగలు కాజేసింది తానేనని ఓప్పుకోవడంతో ఆమెను అరెస్టు చేసి, 15 సవర్ల నగలు స్వాధీనం చేసుకున్నారు. మిగతా 15 సవర్ల నగలను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు సుకన్యను కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

హుండీ ఆదాయం లెక్కింపులో చేతివాటం

● రూ.25 వేల చోరీకి పాల్పడ్డ వృద్ధురాలి అరెస్టు

టి.నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తంజావూరు బృహదీశ్వరాలయం హుండీ ఆదాయం లెక్కింపు సందర్భంగా రూ.25వేలు చోరీచేసిన వృద్ధురాలిని పోలీసులు అరెస్టు చేశారు. తంజావూరు బృహదీశ్వరాలయం సహా ఉపాలయాల వద్దనున్న 11 హుండీల్లో భక్తులు వేసినకానుకలను ప్రతినెలా లెక్కిస్తారు. కానుకల లెక్కించేందుకు ఆలయ సిబ్బంది, స్థానిక భక్తులు పాల్గొంటారు. ఆ మేరకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో పెరియనాయకి అమ్మన్ సన్నిధి ఎదురుగా హుండీ ఆదాయం లెక్కింపు జరిగింది. ఆ సందర్భంగా నగదును లెక్కిస్తున్న ఇందిరా (60) అనే వృద్ధురాల రూ.500లు, రూ.200లు, రూ.100ల నోట్లను దాచుకుంది. అరగంట గడిచాక అప్పటిదాకా తాను అపహరించిన నగదుతో దూరంగా వెళ్ళి తన వడిలో మూటగట్టుకున్న నోట్లను గబగబా లెక్కించేందుకు ప్రయత్నించగా, కొన్ని నోట్లు నేలపై పడటం, సరిగ్గా ఆ సమయంలోనే ఆలయ ఉద్యోగి వీరమణి అక్కడికి రావటం జరిగాయి. వెంటనే వీరమణి ఆమెను పట్టుకుని ఆమె దగ్గరున్న నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆలయ అధికారుల ఫిర్యాదు మేరకు తంజావూరు నార్త్ పోలీసులు ఆమెను అరెస్టు చేశారు.



అరెస్టయిన ఇందిరా

ఎల్టీటీఈ ప్రభాకరన్‌కు దీటైన వీరుడు ఈపీఎస్

● మాజీ మంత్రి రాజేంద్ర బాలాజీ

టి.నగర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) శ్రీలంకలో ప్రత్యేక ఈలం కోసం పోరాడిన ఎల్టీటీఈ నాయకుడు ప్రభాకరన్‌కు దీటైన వీరుడని మాజీ మంత్రి రాజేంద్రబాలాజీ కొనియాడారు. అన్నాడీఎంకే విరుదునగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శివకాశిలో జరిగిన బూత్ కమిటీ నిర్వాహకుల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ అన్నాడీఎంకేను ఎదుర్కొనే సత్తా డీఎంకేకు లేదన్నారు. వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకేలా మరో బలమైన కూటమి ఏర్పడే అవకాశం లేదన్నారు. డీఎంకే పాలకులు తనపై తప్పుడు కేసులు బనాయించి అరెస్టు చేసేందుకు కుట్రపన్నుతున్నారని, ఆ కేసులకు తాను భయపడే ప్రసక్తే లేదని, తానెలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదన్నారు.

అన్నాడీఎంకే తరపున ప్రచారం

● ఏఎంఎంకే నేత టీటీవీ దినకరన్

పెరంబూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఆహ్వానిస్తే రాబోయే శాసనసభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిలోని ఆ పార్టీ కోసం ప్రచారం చేస్తానని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ తెలిపారు. పుదుకోట బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకానుందని, ఆ విషయాన్ని కేంద్ర మంత్రి అమిత్ షా కూడా తెలిపారన్నారు. కేంద్రంలో బీజేపీకి సొంత మెజార్టీ ఉన్నా, కూటమి పార్టీలకు మంత్రి పదవులిచ్చిందని గుర్తుచేశారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే-బీజేపీ కూటమి అధికారం చేపడుతుందని, ఈ కూటమికి మద్దతుగా 234 నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తానని టీటీవీ దినకరన్ తెలిపారు.

'నాన్ ముదల్వన్' పథకంపై విమర్శలు

● హెచ్ఎంపై బదిలీ వేటు


వాషర్‌మెన్‌పేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న 'నాన్ ముదల్వన్' సహా పలు పథకాలను విమర్శించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుపై బదిలీ వేటుపడింది. తిరుపత్తూర్ జిల్లా వాణియంబాడి సమీపం నిమ్మియంపట్టి ప్రాంతంలోని ప్రభుత్వ మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న అముద, పాఠశాలలో పనిచేస్తున్న సహచార ఉపాధ్యాయురాలితో మాట్లాడిన సంభాషణ ఆడియోగా సామాజిక మాధ్యమాల్లో వెలువడింది. అందులో... రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అమలుచేస్తున్న నాన్ ముదల్వన్ పథకం, ఆ పథకం, ఈ పథకం అంటూ వేసవి సెలవుల్లో కూడా అధికారులు వేధిస్తున్నారని, పాఠశాల నిర్వహణలో కమిటీ సభ్యులుగా ఉన్న దళితులు సమావేశంలో పాల్గొని పథకాలపై ప్రశ్నించడం అసహ్యంగా ఉందంటూ పలు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలతో కూడిన ఆడియో సోషల్ మీడియాలో వెలువడింది. ఈ వ్యవహారంపై స్పందించిన పాఠశాల విద్యాశాఖ, ప్రధానోపాధ్యాయులు అముదను కృష్ణగిరి జిల్లా సింగారపేట ప్రభుత్వ పాఠశాలకు బదిలీ చేసింది.

చెన్నైలో ల్యాండైన బెంగళూరు విమానాలు

అడయార్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు మహానగరంలో వాతావరణం అనుకూలించకపోవడంతో ఆరు విమానాలను దారి మళ్ళించి చెన్నైలో ల్యాండింగ్ చేశారు. ఈ విమానాల్లో వచ్చిన ప్రయాణికులందరినీ బుధవారం ఉదయం తిరిగి బెంగళూరు పంపించారు. ఐటీ నగరం బెంగుళూరులో మంగళవారం రాత్రి ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఈ ప్రతికూల వాతావరణం కారణంగా విమానాలు దిగేందుకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగాల్సిన థాయ్ ఎయిర్‌లైన్, ఇండిగో ఫ్లైట్, ఆకాష్ ఎయిర్‌లైన్స్, ఎయిర్ ఇండియా విమానం, రాంచీ నుంచి బెంగళూరుకు వచ్చిన ఇండిగో విమానంతో సహా మొత్తం ఆరు విమానాలను దారి మళ్ళించి చెన్నైకి తిప్పి పంపించారు. ఈ విమానాల్లోని ప్రయాణికులను తిరిగి బుధవారం ఉదయం బెంగళూరు పంపించారు. ఈ కారణంగా ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

పంచలోహ గరుడాళ్వార్ విగ్రహం లభ్యం

ప్యారీస్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా మూలక్కరైపట్టి సమీపంలోని అంబళం గ్రామంలోని బావిలో పూడికతీత పనుల్లో పంచలోహ గరుడాళ్వార్ విగ్రహం లభ్యమైంది. అంబళం గ్రామంలోని వినాయకుడి ఆలయ ప్రాంగణంలో బావినీటిని గ్రామస్థులు వినియోగించుకుంటున్నారు. బావిలో ప్రస్తుతం నీరు అడుగంటినందువల్ల అరియకుళం పంచాయతీ అధికారులు ప్రజాధనంతో పూడికతీత పనులు ప్రారంభించారు.. బావి అడుగు భాగంలోవున్న నీటిని మోటరు ద్వారా తీయించి, అడుగున వున్న చెత్తాచెదారాన్ని తొలగిస్తుండగా సుమారు ఒకటిన్నర అడుగుల ఎత్తున్న పంచలోహ గరుడాళ్వార్ విగ్రహం లభ్యమైంది. సుమారు వెయ్యేళ్ల క్రితంనాటి ఈ విగ్రహం కోట్లాది రూపాయల విలువ చేస్తుందని అంచనా. దీనిపై సమాచారం ఇవ్వడంతో బుధవారం ఉదయ వెళ్ళిన పురావస్తుశాఖ అధికారులు ఆ విగ్రహాన్ని తాహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్ళారు. స్థానిక పోలీసులు, విగ్రహాల స్మగ్లింగ్ నిరోధక విభాగం అధికారులు, పురావస్తుశాఖ అధికారులు విచారణ చేపట్టారు.



20 నుంచి డీఎంకే ఆధ్వర్యంలో ఇంటింటా సభ్యత్వ కార్యక్రమం

చెన్నై, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండటంతో జూలై నెలాఖరులోగా ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో కనీసం 30 శాతం మందికి పార్టీ సభ్యత్వం కల్పించాలని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపుమేరకు ఈ నెల 20 నుండి ఇంటింటా సభ్యత్వ కార్యక్రమాలు ప్రారంభమవుతున్నాయి. ఈ మేరకు కాంచీపురం నార్త్ జిల్లా డీఎంకే శాఖ ఇన్‌ఛార్జి, రాష్ట్ర మంత్రి దామో అన్బరసన్ ఓ ప్రకటన విడుదల చేశారు. శాసనసభ ఎన్నికలకు ఇక తొమ్మిది నెలల మాత్రమే గడువు ఉండటంతో జిల్లా కార్యదర్శులు, పోలింగ్ బూత్ ఇన్‌చార్జులు కలిసికట్టుగా ఇంటింటికీ వెళ్ళి డీఎంకే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేసి కొత్త సభ్యులను పార్టీలో చేర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మెట్రోరైల్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత

● ప్రయాణికుల అవస్థలు

ప్యారీస్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక లోపం కారణంగా స్థానిక త్రిశూలం విమానాశ్రయంలో మెట్రోరైల్ సేవలను బుధవారం తాత్కాలికంగా నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ త్రిశూలం మినహాయించి మీనంబాక్కం-వింకోనగర్ మధ్య మెట్రోరైల్ సేవలు కొనసాగాయి. త్రిశూలం విమానాశ్రయం మెట్రోరైల్వే స్టేషన్‌లో హఠాత్తుగా ఏర్పడిన సాంకేతిక లోపం సరిచేసి, యథావిధిగా రైలు సేవలు ప్రారంభించనున్నట్లు సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు.

సబర్బన్ రైలు ఢీకొని విద్యార్థి మృతి

పెరంబూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూర్‌లో సబర్బన్ రైలు ఢీకొని ప్లస్ టూ విద్యార్థి మృతిచెందాడు. తిరువొత్తియూర్ ఛార్లెస్ నగర్ 3వ వీధికి చెందిన మహమ్మద్ తస్లీమ్ కుమారుడు మహమ్మద్ కుసనదీప్ (17) అదే ప్రాంతంలోని ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం పాఠశాల అనంతరం కుసనదీప్ ఇంటికి వెళ్లేందుకు వింక్‌నగర్‌లోని రైలు పట్టాలు దాటుతున్న సమయంలో చెన్నై బీచ్ నుంచి గుమ్మిడిపూండి వైపు వెళ్తున్న సబర్బన్ రైలు ఢీకొంది. దీంతో అతను ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న కొరుక్కుపేట రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

జాతి, మతం లేని ధ్రువ పత్రాల జారీకి చర్యలు

● రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సిఫారసు

వాషర్‌మెన్‌పేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కులం, మతం లేదని ధ్రువ పత్రాల జారీకి తగిన ఉత్తరులివ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు సిఫారసు చేసింది. తిరుపత్తూర్‌కు చెందిన సంతోష్ మద్రాసు హైకోర్టులో వేసిన పిటిషన్‌లో, కులం, మతం లేదని ధ్రువీకరణ పత్రం అందించాలని కోరగా అధికారులు నిరాకరిస్తున్నారని, అలాంటి పత్రాలు ఇచ్చేలా ఉత్తర్వులు జారీచేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ బుధవారం విచారించిన హైకోర్టు, కులం, మతం లేని ధ్రువీకరణ పత్రం కోరిన పిటిషనర్‌ను అభినందిస్తూ, అలాంటి పత్రాలు అందజేయడంపై తగిన ఉత్తర్వులు జారీచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది.

టి.నగర్‌లో ఆక్రమణల తొలగింపు

అడయార్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ ప్రాంతంలోని పాండిబజార్, రంగనాథన్ వీధి తదితర ప్రాంతాల్లో ఉన్న ఆక్రమణలను తొలగించారు. దీని కారణంగా ఆయా ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితి చక్కదిద్దారు. నగరంలోని ప్రధాన వ్యాపార ప్రాంతమైన టి.నగర్‌లోని అనేక వీధులు నిత్యం రద్దీగా ఉంటాయి. ముఖ్యంగా రంగనాథన్ వీధి, పాండిబజార్‌లో రద్దీ విపరీతంగా ఉంటుంది. అయితే, కొందరు వ్యాపారులు ఇరువైపులా రోడ్డును ఆక్రమించడంతో రోడ్లు కుంచించుకుని పోయాయి. ఈ కారణంగా పాదాచారులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. ఈ విషయంపై నగర పాలక సంస్థ అధికారులకు ఫిర్యాదులు వెళ్ళడంతో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు కార్పొరేషన్ సిబ్బంది ఈ ఆక్రమణలను పోలీసుల సాయంతో తొలగించారు.

పులియంతోపులో నలుగురు రౌడీల అరెస్టు

అడయార్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పులియంతోపు నలుగురు రౌడీలను పోలీసులు అరెస్టు చేశారు. గత నెల 26వ తేదీ పులియంతోపు, అష్టభుజం రోడ్డులో వింధ్య (23) అనే హిజ్రాతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో విజయ్ , సంజయ్ అనే ఇద్దరు రౌడీలను పోలీసులు మొదట అరెస్టు చేశారు. వీరిని విచారించగా పులియంతోపు కేఎం గార్డెన్‌కు చెందిన చంద్రూ (20), ఓట్టేరి సోమత్తమ్మాళ్ కాలనీ ప్రాంతానికి చెందిన సురేష్ కుమార్ (18) అనే వారికి సంబంధం ఉన్నట్టు తేలడంతో వారిని కూడా అరెస్టు చేశారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ప్రహరీ గోడకూలి కార్మికుడి మృతి

ప్యారీస్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామాపురంలో కాలువ నిర్మాణ పనులు చేస్తున్న కార్మికుడిపై ప్రహరీ గోడకూలి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. రాణిపేట జిల్లాకు చెందిన గణపతి (34) గత రెండేళ్ళుగా కాంట్రాక్ట్ విధానంలో రామాపురం వళ్లువర్ రోడ్డులోవున్న శ్మశాన వాటికలో చేపట్టిన వాననీటి నిర్మాణం పనుల్లో పాల్గొంటున్నాడు. రోజూలాగే మంగళవారం కూడా విధుల్లో పాల్గొంటున్న సమయంలో హఠాత్తుగా శ్మశాన వాటిక ప్రహరీగోడ గణపతిపై కూలిపడటంతో అతను అక్కడికక్కడే మృతిచెందినట్లు రామాపురం పోలీసులు తెలిపారు.

మురుగన్ మహానాడును విజయవంతం చేయండి

● తిరుత్తణి హిందూ మున్నని సంఘం



హిందూ మున్నని సభ్యులతో తిరుత్తణి మురుగన్ భక్తులు

తిరుత్తణి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయంలో మంగళవారం సాయంత్రం రాష్ట్ర హిందూ మున్నని సంఘ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, ఈ నెల 22న మదురైలో మురుగన్ మహానాడు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు మురుగన్ భక్తులు, హిందూ సంఘాల నేతలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర హిందూ మున్నని సంఘ నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో పికాక్ ఆస్పత్రి ఛైర్మెన్ శ్రీకిరణ్, హిందూ మున్నని నాయకులు పాల్గొన్నారు.

కుల సంఘాలను నిషేధించాలంటూ పిటిషన్

● రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

పెరంబూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కుల సంఘాలపై నిషేధం విధించాలనే పిటిషన్‌పై అఫిడవిట్ పిటిషన్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు జారీచేసింది. మదురై మనగిరికి చెందిన సెల్వకుమార్ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో దాఖలుచేసిన ప్రజావ్యాజ్యంలో... రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలపై నేరాల నిరోధించేలా రాష్ట్రస్థాయిలో ముఖ్యమంత్రి, డీజీపీతో కూడిన కమిటీ, జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, ఎస్పీలతో కూడిన కమిటీలున్నాయని తెలిపారు. జిల్లా కమిటీలు షెడ్యూల్డ్ కులాలపై జరిగే నేరాలను దర్యాప్తు చేసి రాష్ట్ర కమిటీకి నివేదించాల్సి ఉందని, కానీ ఇది జరుగుతున్నట్లు కనిపించడం లేదన్నారు. . రాష్ట్రంలో డీజీపీ నేతృత్వంలోని ఎస్సీ, ఎస్టీ రక్షణ కమిటీ సక్రమంగా పనిచేయాలని, షెడ్యూల్డ్ కులాల భద్రత నిర్ధారించాలని, కుల విద్వేషాలు రెచ్చగొట్టే యూ ట్యూబ్ ఛానళ్లు నిషేధించాలని, ఎన్నికల కమిషన్‌లో నమోదుకాని, ఎన్నికల్లో పోటీచేయని కుల పార్టీలు, సహకార సంఘం నిబంధనలు ఉల్లంఘించి పనిచేస్తున్న అన్ని కుల సంఘాలను నిషేధించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ న్యాయమూర్తులు ఎస్ఎం.సుబ్రమణ్యం, ఏటీ మరియా గ్లాట్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించి, ఈ పిటిషన్‌పై రాష్ట్ర ఆదిద్రావిడ సంక్షేమ శాఖ కార్యదర్శి, డీజీపీ, రిజిస్ట్రేషన్ శాఖ కార్యదర్శులు అఫిడవిట్లు దాఖలుచేయాలని నోటీసులు జారీచేసి, విచారణ వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

చిత్రజ్యోతి

'కాంచన-4' షూటింగ్‌కు అంతరాయం ?


నోరా ఫతేహి

ప్రముఖ కొరియోగ్రాఫర్, దర్శకనిర్మాత, నటుడు రాఘవ లారెన్స్ హీరోగా 'దెయ్యం' సిరీస్‌లో 'కాంచన' పేరుతో వచ్చిన మూడు చిత్రాలు ఘన విజయం సాధించాయి. దీంతో ఈ సిరీస్‌లో నాలుగో భాగానికి రాఘవ లారెన్స్ శ్రీకారం చుట్టారు. గోల్డ్ మైన్స్ నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రధాన హీరోయిన్‌గా పూజా హెగ్డే, మరో హీరోయిన్ పాత్రకు బాలీవుడ్ నటి నోరా ఫతేహిని ఎంపిక చేశారు. ప్రతి నాయకుడుగా 'కేజీఎఫ్' ఫేం రామచంద్ర రాజు నటిస్తున్నారు. కొన్ని రోజుల పాటు శరవేగంగా షూటింగ్ జరుపుకుంది. అయితే, రాఘవ లారెన్స్ తన కొత్త చిత్రం 'బెంజ్' కోసం సమయాన్ని కేటాయించారు. దీంతో 'కాంచన-4' నాలుగో భాగం షూటింగ్‌కు బ్రేక్ వచ్చింది. చెన్నై, పొల్లాచ్చి ప్రాంతాల్లో కొంతభాగం షూటింగ్ జరుపుకోగా, ఇప్పటివరకు 40 శాతం షూటింగ్ పూర్తి చేశారు. తదుపరి షెడ్యూల్‌ను పుదుచ్చేరిలో ప్లాన్ చేశారు. అయితే, 'బెంజ్' మూవీ చిత్రీకరణలో రాఘవ లారెన్స్ బిజీగా ఉండటంతో 'కాంచన-4' మూవీ పరిస్థితి ఏంటన్న చర్చ ఇపుడు కోలీవుడ్‌లో సాగుతోంది.

కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా 'చెన్నై సిటీ గ్యాంగ్‌స్టర్'

● 20న రిలీజ్

వైభవ్, అతుల్య రవి జంటగా నటించిన 'చెన్నై సిటీ గ్యాంగ్‌స్టర్స్' చిత్రం పూర్తిస్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందించినట్టు ఆ చిత్ర దర్శకద్వయం విక్రమ్ రాజేశ్వర్, అరుణ్ కేశవ్ వెల్లడించారు. నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఈ నెల 20వ తేదీ విడుదలకు సిద్ధమైంది. దీన్ని పురస్కరించుకుని చిత్ర బృందం నగరంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఇందులో దర్శకద్వయం మాట్లాడుతూ, 'చెన్నై సిటీ గ్యాంగ్‌స్టర్స్ మూవీలో స్మార్ట్ హాస్యం, ఉత్కంఠతకు గురిచేసే స్క్రీన్‌ప్లేతో పూర్తిస్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించాం. దోపిడీ బ్యాక్‌డ్రాప్‌లో కథ సాగుతుంది. దీనికి కామెడీని జోడించాం, ఖచ్చితంగా సినిమా చూసే ప్రేక్షకులు అమితంగా ఎంజాయ్ చేస్తారు' అని పేర్కొన్నారు. బీటీజీ యూనివర్శల్ పతాకంపై నిర్మాత బాబీ బాలచంద్రన్ నిర్మించిన ఈ చిత్రంలో మణికంఠ రాజేష్, ఆనంద్ రాజ్, జాన్ విజయ్, రెడిన్ కింగ్స్లే, మొట్టై రాజేంద్రన్, సునీల్ రెడ్డి, లివింగ్‌స్టన్, బిపిన్, సూర్య గణపతి తదితరులు నటించారు.



మీడియా సమావేశంలో పాల్గొన్న చిత్ర బృందం

మళ్లీ మెగాఫోన్ పట్టనున్న ప్రదీప్

'లవ్‌టుడే', 'డ్రాగన్' వంటి వరుస బ్లాక్‌బస్టర్ హిట్ చిత్రాల్లో నటించిన హీరో ప్రదీప్ రంగనాథన్ మళ్లీ దర్శకత్వం వైపు మొగ్గు చూపుతున్నారు. 'లవ్‌టుడే'లో హీరోగా నటించడంతో పాటు దర్శకత్వ బాధ్యతలు కూడా చేపట్టారు. కేవలం రూ.5 కోట్లతో నిర్మించిన ఈ చిత్రం రూ.100 కోట్లకు పైగా వసూళ్ళు సాధించి సరికొత్త రికార్డును నెలకొల్పింది. పైగా ఈ కాలంలో వంద రోజులకు పైగా ప్రదర్శించబడిన చిత్రంగానూ నిలిచింది. ఆ తర్వాత అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో వచ్చిన 'డ్రాగన్' మూవీ కూడా ప్రదీప్ రంగనాథన్‌కు మంచి పేరు తెచ్చిపెట్టింది. ప్రస్తుతం విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ', కీర్తివాసన్ డైరెక్షన్‌లో 'డ్యూడ్' చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ రెండు మూవీల తర్వాత 'లవ్ టుడే' మూవీ నిర్మాణ సంస్థ ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా ఓ చిత్రానికి ప్లాన్ చేయగా, దీనికి ఆయనే దర్శకత్వం వహించనున్నారు. సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో సూపర్ హీరో మూవీగా చిన్నారులు యువతను ఆకట్టుకునేలా తెరకెక్కించనున్నారు. పూర్తి వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.


ప్రదీప్ రంగనాథన్

ఆర్య హీరోగా 'ఆనందన్ కాడు'


'ఆనందన్ కాడు' ఫస్ట్‌లుక్


ఆర్య హీరోగా నటించే కొత్త చిత్రానికి 'ఆనందన్ కాడు' అనే టైటిల్ ఖరారు చేసి, మూవీ ఫస్ట్‌లుక్‌తో పాటు టీజర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. 2023లో ఆర్య కథానాయకుడుగా నటించిన 'ఖాదర్ బాషా అలియాస్ ముత్తురామలింగం' తర్వాత ఆయన హీరోగా నటించిన ఒక్క చిత్రం కూడా రిలీజ్ కాలేదు. కానీ, పలు చిత్రాల్లో ప్రతినాయకుడుగాను, మరికొన్నింటిలో అతిథి పాత్రలు పోషించారు. ఇపుడు మళ్లీ హీరోగా నటించారు. మినీ స్టూడియోస్ పతాకంపై నిర్మాత ఎస్.వినోద్ కుమార్ నిర్మించే ఈ చిత్రానికి 'రన్ బేబీ రన్' ఫేం జీయిన్ కృష్ణకుమార్ దర్శకుడు. తమిళం, మలయాళ భాషల్లో ద్విభాషా మూవీగా రూపొందిస్తున్నారు. ఇందులో ఆర్య, ఇంద్రన్, మురళి గోపి, రెజీనా, నిఖిలా విమల్ తదితరులు ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు. ఈ సినిమాకు కథ మురళి గోపి, కెమెరా యువ, సంగీతం అజనీష్ లోక్‌నాథ్.

దేశంలోనే తొలిసారి..!

9 అంతస్థుల భవనంలో

మెట్రో రైలు పరుగులు

● తిరుమంగళం జంక్షన్‌లో నిర్మాణం



తిరుమంగళం రైల్వేస్టేషన్‌కు ఇరువైపులా నిర్మించనున్న టవర్లు (ఊహాచిత్రం)

చెన్నై, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొట్టమొదటిసారిగా తొమ్మిది అంతస్థుల భవనసముదాయంలో నిర్మించే రైలు పట్టాలపై మెట్రోరైలు పరుగులు తీయనుంది. ఈ అద్భుత దృశ్యం తిరుమంగళం మెట్రో రైల్వేస్టేషన్ వద్ద ఆవిష్కృతం కాబోతోంది. రాజధాని నగరం చెన్నైలో రెండో దశ మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా తిరుమంగళం వద్ద షాపింగ్‌మాల్స్‌తో కూడిన బహుళ అంతస్థుల భవన సముదాయం మధ్య నుంచి వెళ్లేలా మెట్రోరైలు మార్గాన్ని నిర్మిస్తున్నారు. ఈ కొత్త రైలు మార్గానికి సంబంధించిన తొమ్మిది అంతస్థుల భవనసముదాయం, టవర్ల ఊహాచిత్రాలను చెన్నై మెట్రోరైల్వే (సీఎంఆర్‌ఎల్) బుధవారం విడుదల చేసింది. నగరంలో రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టును 116.1 కి.మీ వరకు మూడు మార్గాల్లో నిర్మిస్తున్న విషయం తెలిసిందే. వీటిలో మాధవరం - షోళింగనల్లూరు మార్గంలోని తిరుమంగళం జంక్షన్ వద్ద మెట్రో రైల్వేస్టేషన్‌తో పాటు షాపింగ్‌మాల్స్‌తో 9 అంతస్థులతో ఏ, బీ, సీ పేర్లతో మూడు భవనాలు నిర్మించనున్నారు. ఈ భవన సముదాయంలో రెండంతస్థుల రైల్వేస్టేషన్ కూడా నిర్మితమవుతుంది. ఈ భవన సముదాయలతో కూడిన మెట్రో రైల్వేస్టేషన్ నిర్మాణ పనులకు సంబంధించి త్వరలో టెండర్లను ఆహ్వానించనున్నారు. కొత్తగా నిర్మించబోయే ఈ భవనంలో పలు కార్యాలయాలు, చిల్లర దుకాణాలు, మూడు సొరంగమార్గాల పార్కింగ్ స్థలాలుంటాయి. భారతదేశంలోనే వాణిజ్య సముదాయాలు కలిగిన భవనంలో ప్రయాణించేలా మెట్రోరైలు మార్గాన్ని నిర్మించడం ఇదే ప్రప్రథమమని మెట్రో రైల్వే అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం జపాన్, చైనా దేశాల్లోనే భవన సముదాయాల మధ్య నుంచి రైళ్లు వెళుతున్నాయని, ఆ రీతిలోనే నగరంలోనూ బహుళ అంతస్థుల భవన సముదాయంలోకి మెట్రో రైళ్లు దూసుకెళతాయని తెలిపారు. ఈ భవనసముదాయంలోని నాలుగో అంతస్థులో మెట్రోరైళ్లు ప్రయాణిస్తాయని, మూడో అంతస్థులో ప్రయాణికుల వెయింటింగ్ హాల్స్ ఉంటాయని పేర్కొన్నారు.


తిరుమంగళం మెట్రో రైల్వేస్టేషన్ వద్ద నిర్మించనున్న భవన సముదాయం నమూనా



మన్నార్గుడిలో పెరుమాళ్ ఉదయ గరుడ సేవ

● ఒకే చోట 12 వాహన విగ్రహాల సంగమం

అడయార్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తిరువారూర్ జిల్లా మన్నార్గుడిలో వైకాశి పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయ గరుడ సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 12 ఆలయాలకు చెందిన వాహన విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. మన్నార్గుడిలోని రాజగోపాల్ స్వామి ఆలయం రాష్ట్రంలోని ప్రసిద్ధి చెందిన వైష్ణవ స్థలాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ ఆలయంలో వైకాశి పౌర్ణమి రోజున ఉదయ గరుడ సేవ నిర్వహించడం ఆనవాయితీ. ఈ వేడుకల్లో భాగంగా, గరుడ వాహనంపై ఆశీనులైన పెరుమాళ్‌ను ఊరేగింపుగా వెళ్ళి పామణి నదీ తీరంలో ఉన్న కైలాసనాథర్ ఆలయానికి తీసుకొచ్చారు. మన్నార్గుడి గోపీనాథ స్వామి ఆలయం, చేరన్‌కుళం వేంకటాచలపతి ఆలయం, దేవంకుండి కోదండరామాలయం, ఏత్తక్కుడి రాజగోపాల స్వామి ఆలయం, తిరుమాక్కోట కస్తూరి రంగనాథుడి ఆలయం, ఇరుల్‌నీక్కి లక్ష్మీ నారాయణస్వామి ఆలయం, కాలాచ్చేరి శ్రీనివాసపెరుమాళ్ ఆలయం, పూవనూర్ కోదండరామ వరదరాజస్వామి ఆలయం, కస్తూరి రంగపెరుమాల్ ఆలయం సహా మొత్తం 12 వైష్ణవాలయాల నుంచి వాహన విగ్రహాలను వేర్వేరుగా వాహనాల్లో ఊరేగింపుగా నదీ తీరానికి తీసుకొచ్చారు. ఈ 12 పెరుమాళ్ స్వాముల విగ్రహాలను ఒకచోట ఉంచి ఉదయ గరుడ సేవను నిర్వహించారు. ఇందులో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఈ వేడుకల ఏర్పాట్లను రాజగోపాల స్వామి ఆలయ పాలక మండలి అధ్యక్షుడు ఇళవరసన్, కార్యనిర్వహణాధికారి మాధవన్ తదితరులు పర్యవేక్షించారు.

ప్రజా గ్రీవెన్స్‌లో 27 వినతులు

పెరంబూర్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూర్‌లోని గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ జరిగింది. ఈ సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ అరుణ్ పాల్గొని ప్రజల నుంచి సమస్యలతో కూడిన 27 వినతిపత్రాలు స్వీకరించి, సమస్యలపై విచారణ చేపట్టి సత్వరం పరిష్కరించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను ఆదేశించారు.


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న నగర పోలీస్ కమిషనర్ అరుణ్

మహిళల ఆర్థిక వ్యవస్థను

మెరుగుపరచడమే లక్ష్యం

● ఉపముఖ్యమంత్రి ఉదయనిధి

ప్యారీస్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. చేపాక్‌లోని కలైవానర్ అరంగంలో బుధవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉదయనిధి రాష్ట్రస్థాయిలో ఉత్తమ సేవలందించిన 35 మహిళా స్వయం సహాయక బృందాలకు 'మణి మేఘలై' అవార్డును ప్రదానం చేశారు. అలాగే విభాగాల వారీగా అవార్డు గ్రహీతలకు రూ. లక్ష నుంచి రూ.5లక్షల వరకు నగదు బహుమతి అందించారు. మరో ఐదు మహిళా స్వయం సహాయక బృందాలకు రుణాలు పంపిణీ చేశారు. అనంతరం మహిళా సంఘాలు గానుగాడించిన వేరుశనగ నూనె అమ్మకాలను కూడా ఉదయనిధి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ, 2025- 2026 ఆర్థిక సంవత్సరంలో మహిళా స్వయం సహాయక బృందాల ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచేలా రూ.37వేల కోట్లు బ్యాంకు రుణాలను అందజేయనున్నట్లు తెలిపారు. సంవత్సరమంతా నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో తాను పాల్గొంటున్నప్పటికీ, మహిళల నిర్వహించే కార్యక్రమంలో పాల్గొన్న తనకు సొంతింట్లో అక్కాచెల్లెళ్లను చూస్తున్న భావన కలుగుతోందన్నారు. మహిళలు వృత్తులపరంగానే కాకుండా క్రీడారంగంలో కూడా ప్రతిభావంతులుగా ఎదిగేలా రాష్ట్రప్రభుత్వం ప్రతీఏటా క్రీడా పోటీలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం మహిళా స్వయం సహాయక బృందాలు తయారుచేసే వస్తువులను విక్రయించేందుకు 'మది' పేరిట డిజైన్ చేసిన లోగోను ఉపముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ప్రియ, ఎంపీ దయానిధి మారన్, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మహిళలకు సంక్షేమ సహాయాలు అందజేస్తున్న ఉదయనిధి స్టాలిన్

అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోరే

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

చెన్నై, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అవసరమైతే ఒంటరిగా పోటీ చేయడానికి కూడా తమ పార్టీ సిద్ధంగానే ఉందని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత ప్రకటించారు. అన్నాడీఎంకే కూటమిలోనే డీఎండీకే కొనసాగుతోందని, గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు 2026లో ఆ పార్టీకి రాజ్యసభ సీటు కేటాయించనున్నామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల సమీపించే వేళ ఏ పార్టీతో పొత్తుపెట్టుకోవాలనే విషయమై అధికారికంగా ప్రకటిస్తామని, వీలైతే జనవరిలో నిర్వహించే పార్టీ మహానాడులో ప్రకటన చేస్తామని ప్రేమలత తెలిపారు. దానిని బట్టి అన్నాడీఎంకే కూటమిలో చేరేందుకు డీఎండీకే తటపటాయిస్తోందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం నగరంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో తూత్తుకుడి, తిరునల్వేలి, కన్నియాకుమారి సహా దక్షిణాది జిల్లాల పార్టీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల పొత్తుపై నిర్ణయం తీసుకునేందుకు కొంతకాలం పడుతుందని, డీఎండీకే ఒంటరిగా పోటీ చేయడానికి కూడా అనుకూలమైన సమయం కోసం ఎదురుచేస్తున్నామని చెప్పారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడితే మంచిదేనని చెప్పారు. రాజ్యసభ సీటు కేటాయింపుపై అన్నాడీఎంకేతో కుదుర్చుకున్న తొలి ఒప్పందంలోని వివరాలను రెండు పార్టీలకు ఇబ్బంది కలుగకూడదనే వెల్లడించలేదని చెప్పారు. డీఎంకేతో పొత్తుపెట్టుకుంటారా? టీవీకే ఆహ్వానిస్తే ఆ పార్టీ కూటమిలో చేరుతారా? అనే ప్రశ్నలకు డీఎంకే నేతలను, టీవీకే నేత విజయ్ ఆ ప్రశ్నలకు సమాధానాలు చెబుతారని ప్రేమలత స్పష్టం చేశారు.


దక్షిణాది జిల్లాల పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమలత


చెన్నై ట్రిప్లికేన్ ప్రాంతంలోని రాఘవేంద్ర మఠానికి విచ్చేసిన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతులు సుబుదేంద్రతీర్థ స్వామిని గజమాలతో సత్కరిస్తున్న భక్తులు


చెన్నై సాలిగ్రామంలో టీవీకే నేత విజయ్‌ని యువ కామరాజర్‌గా కీర్తించడానికి నిరసనగా ధర్నా జరుపుతున్న నాడార్ పేరవై నాయకులు, కార్యకర్తలు


వడపళని బస్ టెర్మినల్ ఊహాచిత్రం

6.65 ఎకరాల విస్తీర్ణంలో 12 అంతస్థుల్లో వడపళని బస్ టెర్మినల్

చెన్నై, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బస్‌డిపోల్లో నిత్యం సందడిగా ఉండే వడపళని బస్‌డిపో ఉన్న ప్రాంతం షాపింగ్‌మాల్స్ ప్రైవేటు ఆస్పత్రులు, భవనసముదాయాలతో, షాపింగ్‌మాల్స్‌తో అభివృద్ధి చెందింది. ఈ నేపథ్యంలో ఇంకా రేకుల షెడ్లతోనే ఉన్న వడపళని బస్‌డిపో ఎప్పుడు కొత్తరూపు సంతరించుకుంటుందా అని అక్కడి స్థానికులే కాకుండా ప్రయాణికులు, వాహన చోదకులు కూడా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం వడపళనివాసుల చిరకాలపు కోరిక నెరవేర్చడానికి చెన్నై మెట్రోరైల్వే సంస్థ సిద్ధమవుతోంది. 6.65 ఎకరాల విస్తీర్ణంలో 12 అంతస్థుల భవనసముదాయంతో కొత్త బస్‌టెర్మినల్ నిర్మించేందుకు ప్రాజెక్టు కూడా సిద్ధం చేసింది. 158 సిటీ బస్సులు సులువుగా నడిచేలా ఈ బస్ టెర్మినల్ నిర్మించనున్నారు. ఈ భవన సముదాయానికి ఆర్కాడు రోడ్డు వైపు నుంచి, కుమరన్ కాలనీ నుండి ప్రత్యేకమైన కాలిబాట ఏర్పాటు చేస్తారు. ఈ బస్‌టెర్మినల్ ప్రాంతంలో ఉద్యానవనం కూడా ఉంటుంది. అంతే కాకుండా 1475 ద్విచక్రవాహనాలు, 214 నాలుగు చక్రాల వాహనాలు నిలిపేందుకు విశాలమైన పార్కింగ్ కూడా ఏర్పాటు చేస్తారు. మొదటి అంతస్థు నుండి పదవ అంతస్థు వరకు కార్పొరేట్ కార్యాలయాలు, రిసెప్షన్, రెస్ట్ రూమ్‌లుంటాయి. 11, 12 అంతస్థుల్లో అనిమేషన్, విజువల్ ఎఫెక్ట్ గేమింగ్, కామిక్స్ రంగాల కోసం కేటాయిస్తారు. ఐదో అంతస్తును ప్రత్యేక భోజనశాలలకు అప్పగించనున్నారు. దిగువ దళంలో చిల్లర దుకాణాలు ఏర్పాటు చేస్తారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్మించబోయే వడపళని బస్‌టెర్మినల్ నగరంలో ప్రముఖ టూరిస్టు ప్రాంతంగా మారటం ఖాయమని మెట్రోరైల్వేస్ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ వైద్యుల డిమాండ్లను నెరవేర్చండి

● బీజేపీ నేత అన్నామలై



ప్యారీస్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యుల న్యాయమైన కోర్కెలను పరిశీలించి వెంటనే వాటిని నెరవేర్చాలని రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కరోనా లాక్‌డౌన్ సమయంలో విధి నిర్వహణలో మృతి చెందిన వైద్యుల కుటుంబాలకు రాష్ట్రప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని, మృతిచెందిన డాక్టర్ వివేకానందన్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రుల్లో చికిత్సపొందుతున్న రోగులు, వారికి చికిత్సచేస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందికి వసతులు మెరుగుపరచాలని తెలిపారు. ప్రభుత్వాసుపత్రుల్లో ఖాళీ పోస్టులను భర్తీచేయాలని, పాత పింఛన్ విధానాన్నే అమలుపరచాలని తదితర న్యాయమైన కోరికను పరిష్కరించాలని, ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైద్యులను చర్చలకు ఆహ్వానించి, వారి కోర్కెలు నెరవేర్చాలన్నారు. డీఎంకే ప్రతిపక్షంగా ఉన్న సమయంలో ఆందోళనల్లో పాల్గొన్న వైద్యులను సంప్రదించిన ముఖ్యమంత్రి స్టాలిన్ తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వవైద్య రంగంలోని అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ నాలుగేళ్ళు దాటినా నెరవేరలేదని అన్నామలై విమర్శించారు.